ప్రేమ జ్యోతి

శ్రీ ఫక్కి సూర్యనారాయణ శాస్త్రి

●

ఇదేం పాపమండీ శాయమ్మప్పయ్యగారు! రేయిం బగళ్లు అలా యేడుస్తా వుంటారూ; ఆ బుల్లెమ్మ గారు బెదిరి పోయి మీ దరికైనా రాకుండా తిరుగు తున్నారు. చచ్చినారితో చస్తామటండీ? ఉన్నారిని చూచుకోవాల గానీ? అని పెద్ద కుమారుడును రెండవ కూతురున్ను అప్పటికి నాలుగు నెలల కిందట పదిహేనురోజులు యెడంలో చనిపోయినందున దుఃఖ పడుతూ ఉన్న శాయమ్మను రాచ రంగమ్మ ఓదారుస్తూండగా అక్కడకు జాజి పరుగెత్తుకొని వచ్చి అమ్మా! అమ్మా! బావొస్తున్నాడే అని మఱల వీధిలోనికి పరుగెత్తుకొని పోయి బావా! మన - మల్లిపందిలే చాలా పువ్వులు పూస్తూంది బావా! రోజూ దండలు గుచ్చి నేను జడలో పెట్టుగుంటున్నాను. నిన్న నువ్వొస్తావేమో అని పెద్ద దండ గుచ్చి దాచాను. నువ్వు రాలేదు. రా బావా! మల్లెచెట్టు చూద్దామూ అని మేనమామ కుమారుడైన దినమణిని చేయి పట్టుకొని లాగ నారంభించింది జాజి. 'నడిచే వొచ్చావుట్రా నాయనా? చదువుకుంటున్నావా?' అని శాయమ్మ దినమణిని పల్కరిస్తూండగానే జాజి దినమణులు మల్లిపందిరి వద్దకు పోయారు.

వేసవికాలము. వైశాఖమాసము. సాయంకాలము. సూర్యుడు చెట్ల ఆకులకును వెల్ల చరచిన గోడలకును బంగారపు లేబూత పూస్తున్నాడు. పక్షిపిల్లలు తమ గూళ్లలోనుంచి తలలు పైకెత్తి బెట్టి తల్లుల రాకకై జూస్తున్నాయి. వస్తూన్న మేకల మందలకు యెదురుగా పరుగెత్తుచు మేకపిల్లలు 'మే, మే' అని అరుస్తూ మేమే మీ పిల్లలమని తల్లులకు జవా బిస్తూన్న ట్లున్నాయి. మల్లిపందిరి కింద నిలుచున్న జాజి జడలో దినమణి మల్లిమొగ్గలు పెడుతున్నాడు. బావా! పొద్దుగూకి పోతుంది. ఇంక చాలు బావా! అన్ని పువ్వులూ నాకే పెడతావూ_ నీకు దండ గుచ్చాలి; అవి ఉంచు బావా! అని జాజి దినమణి చేతులు పట్టుగున్నది. జాజికి తొమ్మిదేళ్లు వెళ్ళాయి. దినమణికి పన్నెండోయేడు. జాజిని ముద్దు పెట్టుకున్నాడు-దినమణి. ఎవరేనా చూస్తారు బావా!

"ఏం జేస్తున్నావే? రాజ్యం! బావేడీ?"

"ఇక్కడే ఉన్నాడు. పువ్వులు కోస్తున్నాడు."

"శాయమ్మప్పయ్యగారూ! మొగుడూ పెళ్లాలు సరసా లాడుకుంటున్నారు. రండీ! చూడండీ!" అని రాచ రంగమ్మ తమ దొడ్డిగోడవద్ద నిలుచుండి కేకేసింది. జాజి ఒక్క పరుగున యింట్లోకి పోయింది.

"అమ్మా! నువ్వూ నాన్నా నన్ను "రాజీ" అని పిలుస్తారేమే?"

"నీ పేరు రాజ్యలక్ష్మమ్మ. మేం అంతా "రాజీ!" అని పిలుస్తుంటే చిన్నతనంలో బావకి 'రా' పలకక "జాజీ!" అనేవాడు. అందరూ అలాగే పిలవడం మొదలుపెట్టేరు."

"అలా అయితే నాకు జాజి పేరే బాగుందే అమ్మా!"

దినములు గడుచు చున్నవి. జాజికి పదేళ్లు దాటినవి. ఆ పిల్లతండ్రి ఛాందసుడు. కోపిష్టి. ఒకనాడు జాజీ దినమణులు మంచము మీద పడుకొని కథలు చెప్పుగుంటూ ఉన్నారు. జాజితండ్రి వచ్చి ఒరే! మణీ! చెంబిడు నీళ్ళట్రారా కాళ్లు కడుక్కోడానికీ - అన్నాడు.

"మంచి కథ చెబుతున్నాడు నాన్నా! నువ్వు తెచ్చుకో నాన్నా!" అంది జాజి.

"నీ మొహం, నీకు వాడు కథలు చెప్పడ మేమిటి? లే, లేచి అమ్మ దగ్గిరికి పో"

జాజి వెళ్లిపోయింది.

"ఏంరా! నీళ్లు పట్రావేం?"

"నే నెందుకు తెస్తానూ? నన్ను కథ చెప్పొద్దంటేనూ?"

"అరి గాడిదా! నీ కెంత పొగరుబోతుతనంరా"

"అదేవిటి నాన్నా! బావని గాడిద అంటావూ? వాడికి కోపంవొస్తుంది. నీళ్లు నే తెస్తాలే."

జాజి తండ్రి పేరు రామగోవిందదీక్షితులు. ఉదయం సాయంకాలము నాలుగు బిందెల నీళ్లు కావాలి, కాళ్లూ చేతులూ కడుక్కోవడానికి అతనికి. మొగ్గ లోపల విడుస్తూన్నట్లు జాజీ దినమణుల మనస్సులలో ప్రేమనే మొగ్గ వికసిస్తుంది. దీక్షితులు కూతురికి సంబంధం వెతుకు తున్నాడు. శాయమ్మ మనవడూ మనమరాలూ దంపతులైతే చూడాలని గంపెడాశలో ఉంది. దినమణిని చూచి దీక్షితులు విసుక్కోవడం మొదలెట్టాడు. ఒక నాడు దీక్షితులు "మా రాజ్యం మొగుడు యెట్లాగా వుంటాడు. చాల నగలు పెడతాడు. మా అమ్మకి శ్రావణమాసంలో పెళ్లి. రాజ్యం! నువ్వింక మణితో మాట్లాడకేం." అన్నాడు. జాజి తండ్రి మొగం చూచి కళ్ళ నీళ్లు గిఱ్ఱున తిప్పింది. లేచిపోయింది.

"ఏంటోయ్? పిల్లకిష్టంలేని పెళ్లి? వాడికంటే గొప్పవాణ్ణి తెస్తావా ఏమిటీ?" అంది శాయమ్మ.

"నా యిష్టం. నాపిల్ల. కులుకుతున్నావు, మనవడికి కట్టిపెట్టాలనీ. అలా సాగదు" కుతుకులూరుపిల్ల పెళ్లిని గురించి సవాలక్ష గ్రంథం అయింది. అత్తకూ అల్లుడికీ. జాజికి శ్రావణమాసంలో పెళ్లిఅయింది శాయమ్మ యేం జేస్తుందీ? అతని పిల్ల? 'నేను చాకిరీ చేయడానికే కాని మాటకు పనికొస్తానా?' అనుకుంది ఊరుకుంది.

జాజీ దినమణులు మునుపటివలె చనువుగా వుండడంలేదు. క్రమంగా మణికి జాజితో మాట్లాడ్డానికికూడా జంకు కొంకూ కలిగింది. దగ్గరగా ఉన్న చెట్టుకి అల్లుకో బోతూన్న తీగెను మళ్లించి దూరపు చెట్టుకి అంటగడితే ఆ తీగ యేం జేస్తుందీ? ఆ చెట్టునే చుట్టుకొని అక్కడే కాస్తుంది. తోటమాలి బుద్ధి మాలిన వాడైతే యింతేగా.

దినమణి కొన్నాళ్ళు దిగులుగా ఉన్నట్లుండేవాడు. రామగోవింద దీక్షతులుకు పాపం క్షయరోగం. దానివల్ల చాలా బాధ పడుతూ ఉండేవాడు. జాజి కాపరానికి వెళ్ళి రెండేళ్లైంది. కుతుకులూరులో పదిమందిలోనూ బుద్ధిమంతురాలని పేరు మోసింది. జాజి మగని పేరు శ్యామమూర్తి. మంచి హోదాయలుకాడు. అతనికొక విధవ అప్పగారుంది. ఆమె కాపురాని కెళ్లడానికి ముందే ముండమోపి కావడంవల్ల అతనివద్దనే ఉంది. ఆమె శ్యామమూర్తి కేమి బోధించిందో శ్యామమూర్తి మళ్లీ పెండ్లాడడానికి నిశ్చయించుకున్నాడు. ఒకనాడతడు భార్యతో 'పిల్లా! నేను మళ్లీ పెళ్లి చేసుకుంటానే. ఏమంటావు?' అన్నాడు. జాజి 'మీ యిష్టం' అంది. ఆరోజుమొదలు ఆమె పున్నమవెళ్లిన చంద్రుళ్లాగ దిగనారం జొచ్చింది. శ్యామమూర్తి మళ్లీ పెళ్లాడాడు. అతని రెండోభార్య దుర్గ. సవతి కాపరాని కొచ్చింతర్వాత జాజి భర్తతో రహస్యంగా మాట్లాడి యెరుగదు. పొద్దుట యింటిపనులు సాయంకాలం దుర్గకు తలదువ్వి పువ్వులు ముడిచి తయారు చేయడం; యివి ఆమె నిత్యకృత్యాలు. రంగుచీర కట్టుకోవడం మానేసింది. ఆమె నడవడికి లోకులు ఆశ్చర్యపడేవారు. కొందరు మనస్సులో వుంచుకోలేక 'శ్యామంగారూ! ఆ అమ్మాయిని యిలా అన్యాయం చేయడం మీకు మంచిదికాదండీ. సావిత్రిలాంటి పిల్ల, చక్కనిచుక్క. ఈ కొంకినక్కనోదాన్ని తెచ్చు

గున్నా వెందుకయ్యా? ఆ తల్లి కన్నీళ్లు మీ నట్టింట పడరాదయ్యా! మంచిపని చేశావుకావయ్యా' అనే వారు. అలా అన్నవారికీ శ్యామమూర్తి అప్పుడూ మహాయుద్ధ మయ్యేది. కొన్నాళ్లకి జాజితండ్రి క్షయరోగి కావడంవల్ల ఆ రోగం గలవాళ్ల పిల్లలకు తప్పితే మనమలికైనా ఆరోగం మళ్లీవొస్తుందని డాక్టర్లు అన్నందు వల్ల శ్యామమూర్తి ఆమెతో సంబంధం మానుకొని మళ్లీ పెళ్లాడాడని చెప్పుకునేవారు.

ఒకప్పుడు జాజి పుట్టింటికి వచ్చింది. ఊళ్లోవారంతా వచ్చి ఆమెకు తటస్థించిన స్థితికి విచారిస్తూ తమ సానుభూతిని వెల్లడిస్తోంటే ఆమె కొయ్యబారినట్లు తలవంచుకుని కూర్చునేది. ఒకనాడు దినమణి స్నానం చేస్తున్నాడు. జాజి మల్లిపందిలివైపు చూస్తూ కండ్ల నీళ్లెట్టుకుంటూంది. దినమణి చూశాడు.

'ఎందుకే వెఱ్ఱిదానా! అలా విచారిస్తావూ?'

'బావా! చేసిన పాపం అనుభవిస్తేగాని పోతుందటోయ్?'

'నువ్వేం పాపం చేశావూ? పాపమేమిటి? ఆ దుర్మార్గుడి కాలా తోచింది. నీ గొంతు కోశాడు. ఆ వేళ మీనాన్నతో చెప్పి 'నేను బావనే పెళ్ళాడుతాను' అంటే మీనాన్న కాదని ఉండునా? నీకీ విచారం కలిగేదా?

'ఏం మాటలు బావా? నీవి. నాకర్మం యిలా వున్నప్పుడు నిన్ను పెళ్ళాడినా నీకూ పుడు తుంది మళ్ళీపెళ్లిబుద్ధి.'

'అలా యెప్పటికీ కాదే.'

'పోనిస్తూ బావా! నన్ను మరింత యేడిపించకూ.'

జాజి పుట్టినింట నున్న నెలదినాలున్నూ జాజీ దినమణులు వెఱ్ఱివారివలె నుండేవారు. జాజి ఎప్పుడు చూచినా యేదో ఆలోచిస్తూనే ఉండేది. ఇంకా కొన్నాళ్లుండమని శాయమ్మ బ్రతిమాలుకున్నా వినక జాజి అత్తవారింటి కెళ్లిపోయింది.

ఇది జరిగిన ఆరునెలలకు ఒకనాడు కూలివాడొక ఉత్తరముతెచ్చి శాయమ్మకిచ్చాడు. అందిట్లు న్నది: 'మీ మనవరాలికి యీ వేళకి తొమ్మిది లంఖణాలు. రాత్రి సంధిగుణం కనపడింది. మందువేయిస్తు న్నాము. దేవుడి దయవల్ల నెమ్మదిగా ఉండవచ్చును. వెంటనే రావలెను. వ. శ్యామమూర్తి వ్రాలు.'

ఉత్తరం చూడగానే శాయమ్మ నిలువునా కూలిపోయింది. వెంటనే బయలుదేరింది. దినమణి కూడా వెళ్లాడు; వారిద్దరూ వెళ్లేటప్పటికి జాజి చెరుపూ మరుపూ స్థితిలోవుంది. వచ్చినవారిని చూపి అక్క డున్నవారిలో ఒకరు రాజ్యలక్ష్మమ్మగారూ! ఎవరోవచ్చారు చూడండీ, వారెవరు? అన్నారు. జాజి నిదానించి చూచి 'మా అమ్మ' అంది. ఇంకొకరు ఆ నిలబడిన వారెవరో చూడమ్మా, అన్నారు. జాజి చూచింది. ఆమెకళ్లు నీళ్లతో నిండిపోయినయి. 'ఎవరమ్మా ఆ అబ్బాయీ?' అన్నారు ఇంకొకరు.

'ఎవరో' అంది జాజి, మొగం తిప్పుకుంది.

ఆ మరునాడు సాయంకాలం అయిదుగంటలకు దినమణి మణికట్టుమీద చెయ్యివేసుగుని జాజి శాశ్వతంగా కన్నుమూసింది. శాయమ్మకు లోకమంతా చీకటైంది.

దినమణి మనస్సులో తన జాజి చిన్ననాటి ప్రేమజ్యోతి అతని జీవితకాలమంతా వెలుగుతూనేఉంది.